# వైరాగి నాగు!

- బలివాడ కాంతారావు



ఈ సంఘటన జరిగి చాలా కాలం అయింది. ఆ రోజుల్లో ఆ పల్లెటూరి ప్రజల నివాసాలు కులాలవారీగా విడివడిన వీథుల్లో ఉండేవి. అలాంటి ఒక పెద్దకులం వీథిలో లక్ష్మీనారాయణ ఉన్నాడు. ఆ వీథిలో ఉన్న ఒక్క పెంకుటిల్లు లోగిలీ అతనిదే. పెళ్లాం మెడనిండా బంగారం. ఊరిలో పల్లం భూములు. పనికి అందిన పిల్లలు. అన్నిటికీ మించిన ధనాపేక్ష.

వీథి చివరలో ఆదెమ్మ ఉండే అతి పేదరికంతోపాటు అమాయకురాలని పేరుపడిపోయింది. మొగుడు అప్పలరాజు అట్టహాసంగా ఏదైనా చెప్తాడు గానీ వాడి మాటలు విన్నవాళ్లు తక్కువ. వీడికి కులంపేరే గానీ మరే పేరూ లేదు. చాతకాని

వాడనుకున్నా ఒకోసారి తను కోపంతో చేసిందే సరైనదని మొండిపట్టు పట్టేవాడు. అలా కాకపోతే ఆదెమ్మ బతిమాలినా అంతపని చేస్తాడా?

ఈ రెండు కుటుంబాల మధ్య జరిగిన గాథ ఆ కాలంనాటిదైనా ఈ కాలంలో చెప్పుకున్నా కొత్తగానే ఉంటుంది. కడుపుయాతన కన్నీటితో నింపుకుంటే నిండుతుందా? ఆ వీధిలో కడుపు సగం నిండాలన్నా ఆ పెంకుటింటితో ఏదో ఒక సంబంధం పెట్టుకోవాలి. వాళ్లు చెప్పినట్లు వినడం. వాళ్ల దాసీపనులు చెయ్యడం. వాళ్లు తిట్టితే తల దించటం. మొట్టికాయ పెట్టే ముద్దించడంగా తీసుకోవడం అలవాటైపోయింది. ఏమని అడిగేతే ఇంకేమైనా ఉన్నదా?

ఆదెమ్మ ఆ ఇంట్లో వంటపుట్టిగా కుదిరింది. పనిలో సహాయంగా తల్లీతండ్రి లేని చెల్లెలు కాంత వెంట ఉండేది. గోకిపోయిన ముఖంతో చేతి యెముకలు కనిపిస్తున్న ఆదెమ్మకు, సింగారించుకున్నట్లున్న కాంత మెరిసే ముఖానికీ, పుష్టిగా నున్న శరీరానికి యెంత తేడా! ఒకే తల్లి బిడ్డలంటే ఎవరూ నమ్మేవారు కాదు. అందరి కళ్ల యెదట అలా తోటకాడలా పెరిగి ఒక్కసారి వయసు రాగానే దబ్బపండులా మారిన కాంతమీద అందరి కళ్లూ ఉండేవి. తెల్లగా తోమిన గిన్నెల్లో ముఖం చూసుకుంటే తనదేనా అన్న గర్వం! కదలని నీటిలో చందమామ మెరిసినట్లు తన ముఖం కనిపిస్తుంటే అదో హాయి. ఈ గర్వాలూ ఈ హాయిలూ లోకం పోకడను గమనించే జ్ఞానం ఇవ్వలేదు.

ఓ రోజు కాంత మెల్లగా ఒంటరిగా అడిగితే ఆ ఇంటి యజమానురాలు ఆ పెంకుటింటి నుంచి జుత్తు పట్టుకుని ఈడ్చి నానా దుర్భాషలూ ఆడింది. అక్కా చెల్లెళ్లకు అందంలో తేడా ఉన్నా ఒకే రక్తం పంచుకున్నవాళ్లు కదా! "దాన్ని అడవిలోకి లాగి అనుభవించి పులినోట పారేడం సబబా?" అని అడగాలనుకున్నా ఆ పెద్దింటి ఇల్లాలు ఆడపులిగా మారి కోరలతో ఆదెమ్మను రక్కేస్తూ "అదెక్కడ గడ్డి నమిలిందో?" అనగానే లక్ష్మీనారాయణ చొరవ చేసుకుని,

"కాంతం తప్పు ఇందులో లేదు. ఇంత చెడ్డపని చేసిన పాలేరు రంగడు పరారైపోయాడు. వాడిని వెతికించి పట్టుకువస్తాను. ఆగండి జాతి భ్రష్టురాలైనా ఒక మొగుడుంటాడు కదా!" ఓదార్చినట్లు తను అతీ గతీ లేక పెళ్లికాకుండా ఉన్న ఒక పిల్లకు పెళ్లి చేయడం తన బాధ్యత అన్నట్లు నవ్వుతూ నాలుగు మంచి మాటలు చెప్పాడు.

జడిసిపోయి ఇద్దరు అప్పచెల్లెళ్లు ఇంట్లో పస్తులున్నారు గానీ ఆ పెంకుటింటివేపు వెళ్లలేదు. ఆర్జన పడిపోగానే అప్పలరాజులో ఆవేశం పెరిగిపోయింది. చలికాలంలో అర్ధరాత్రిమీద కాంతను పొమ్మన్నాడు. ఆదెమ్మ ఆదుకోవాలని ప్రయత్నించినా వాడి మొండిపట్టు వాడిదే.

"సిగ్గుతో చచ్చిపోకండా ఉండాలంటే ఆ పాలేరు బిడ్డ నా ఇంట్లో పుట్టకూడదు!" అని అరిచాడు. అది విన్న లక్ష్మీనారాయణ ఇంకో వీధిలో ఒక పంచ చూపించాడు. ఆకలితో చచ్చిపోకుండా సగం సగం తిండి పంపించాడు. కడుపులో కాస్త ముద్దపడగానే మూగదైపోయింది.

ఆ చూలాలు ఇలా అరుగులమీద చలిలో, ఎండలో, దోమల్లో, ఈగల్లో బ్రతుకుతూ ఉంటే ఇంకా లక్ష్మీనార్ఁాయణ వెతికిస్తున్న రంగడు దొరకలేదు. ఎన్నాళ్లిలా ఉంటావు? ఎవడినో? అని అతను అనలేదు. ఎవరిచేతో అనిపించాడు. ఆ మాటలో ఎన్నో అర్థాలు. ఎవరినో పెళ్లి చేసుకోకూడదా? ఇంత జరిగాక ఎవరు పెళ్లి చేసుకుంటారు? ఎవరితోనో లేచిపోకూడదా అంటే అంత అందచందాలు హరించుకుపోయినట్లుంటే తనవైపు ఎవరు చూస్తారు? ఒక పూటకు తిండి కరువైన రోజులు వచ్చాయి. ఎదురు చూస్తుంటే అనుకోని సంఘటన జరిగింది.

ఒకనాడు చీకటి పడ్డాక "లేవే...!" అన్న కేకలు వినిపించాయి. "నీ నుంచి నేను ఊర్లో తలెత్తుకోలేకపోతున్నాను. ఆ రంగడెక్కడో సచ్చాడట. వాడిక రాడు. నీనించి మేమూ ఆకలితో ఛస్తున్నాము. ఇదిగో వీడు నిన్ను యేలుకుంటానంటున్నాడు. తిండిపెట్టి తన వెంట తిప్పుకుంటాడు, ఫో ఫో!" అని బలవంతాన కాంత చెయ్యిపట్టుకుని ఆ వచ్చినవాడికి అప్పచెప్పితే వాడు వెంటతీసుకుపోయాడు. కన్నీరు ఆపుకుని నడుస్తుంటే ఊరి బయట ఆగి ఆ రాత్రిమీద తన బుట్టలో ఉన్న అన్నం అంతా తినమని ఇచ్చేశాడు. రెండు రోజులు ఆకలి తీరగానే కళ్లల్లో నీరుబికిపోయింది.

"ఏడవకు! నిన్ను బాగా సూసుకుంటాను. నా విద్యలన్నీ నీకు నేర్పుతాను. నేను సచ్చినా నివ్వు బతికేస్తావు!" అని ఓదార్చాడు.

కాంత ఊరు కదలిన వారంనాడే పరారైన పాలేరు రంగడు ఊర్లో కాలుపెట్టాడు. ఎవరేం అడిగినా ఎవరో మూతిని కుట్టేసినట్లు మాట్లాడలేదు. మళ్లీ లక్ష్మీనారాయణ ఇంట్లో యథావిధిగా పనిలో చేరిపోయాడు.

చెల్లెలు దగ్గరనుంచి ఏ కబురూ వినని ఆదెమ్మ మూలుగుతూ, ముక్కుతూ మూడు రోజుల జ్వరంతోనే ముక్కలైపోయింది.

లేనినాడు సరేసరి. ఉన్ననాడు ఇంత

## విక్రమవసంతం

నుదుటిమీద
నూతనశతాబ్ది తిలకం
మెడలో నవసహస్రాబ్దిమాల
విచ్చేసింది విక్రమవసంతం
నింగి నుండి నేలకు
కలలు కన్న కాలం కంటిలోకి
మామూలు మనిషి ఇంటిలోకి-
కోకిలలు పాడుతున్నాయి
క్రొంగొత్తపాటలు,
భాష, భావం, బాణీ మార్చి
ఆవేశంతో ఆలపిస్తున్నాయి
ఆలోచనాగీతాలు
ఈ వింత వసంతవిరాట్టును
ఎలా వర్ణించాలో తెలియక
కవులు కంప్యూటర్లను ఆశ్రయిస్తున్నారు
నిలకడ లేని ప్రాపంచికజీవితాన్ని
నిర్దేశించడానికి
'పంచాంగాలు' చాలవని
పండితులు కలవరపడుతున్నారు
కల్లబొల్లి కబుర్లు చెప్పిన రాజకీయాలు
అల్లిబిల్లిగా అల్లుకుపోతున్నాయి
హితాలు. వల్లించిన మతాలు
ఇటూఅటూ ఊగులాడుతున్నాయి
రాద్ధాంతాలు చేసిన సిద్ధాంతాలు
తీర్చలేని సందేహాల
గందరగోళంలో పడ్డాయి
నిజాలు తెలుసుకోలేని ఇజాలు
భుజాలు తడుముకుంటున్నాయి
'అనంతం' అంటే ఎంతో తెలుసుకోవాలని
సౌరమండల శూన్యాన్వేషణ
అంతరిక్షపు ఆవులింత
కాంతివేగపు కలవరింత
భాషలు ప్రసవించిన పరిభాషలు
భావాలు కల్పించిన ప్రతీకలు
అందాలు పోషించిన అలంకారాలు
సత్యాలు రంగరించిన సామెతలు
కోటికోటి పడగలు విప్పిన
నేటి విశ్వరూపాన్ని
నిర్వచింపలేక, నిరూపించలేక
నివ్వెరపోతున్నాయి
నిట్టూరుస్తున్నాయి
పండుగ చేసుకోవలసిన
ఉగాది
సత్యాసత్యవిచికిత్సలో
ఆత్మానాత్మవివేచనలో పడి
ప్రశ్నార్థకమైపోతున్నది!

జె.బాపురెడ్డి



వండిపెట్టే ఆధరువు లేక అప్పలరాజు అన్నానికి మొహం వాచిపోయాడు. ఎవరి దగ్గర ఎంత ఆశించి అంత పని చేశాడో, వాడు ఆ పని కాగానే చిన్నచూపు చూడగానే, తనమీద తనకే అసహ్యం వేసి చిక్కిపోయాడు. ఈ వీధిలో చచ్చిపోకూడదని ఇల్లు వదలి ఎక్కడికో పారిపోయాడు. ఎవరికీ తెలియలేదు. వీచే గాలులకు, కురిసే వర్షాలకు ఆ పాక శిథిలమైపోయింది.

తుమ్ముగా భోంచేసి, వరండాలో వాలుకుర్చీమీద చారబడి పదుగురికీ లక్ష్మీనారాయణ నీతులు వల్లిస్తున్నాడు. వయసు పెరుగుతున్నకొద్దీ తను సాధించిన గొప్ప విషయాలను ఏకరువు పెట్టున్నాడు. ఇద్దరు ఆడపిల్లలకు, ముగ్గురు కొడుకులకు పెళ్లిళ్లు చేశాడు. వాళ్ల సంతానం బంగారం, శృంగారం. ఆర్జన.... ఒకటేమిటి? కళ్లు తెరచి చూస్తే అంతా స్పష్టంగా కనిపిస్తున్నట్లే ఉంది.

"నాది యథార్థమైన కబురు. భయపడని బతుకు. నిలబెట్టి గుండెను కొట్టినా నా గుండె చెదరదు!" అన్నాడు కూడా.

ఆ మాటలన్న ఆరోరోజున ఊరంతా ఉండగా, ఆ వీధిలోనికే ఒక పాములవాడొచ్చాడు. పెద్దవాడు కాదు. పంద్రెండేళ్ల పాపడు. సరిగ్గా కాంత ఆ ఊరి నించి తగలేసిన పంద్రెండో ఏడు దాటాకే మళ్లీ తొలిసారి కాలుపెట్టిందా వీధిలో. ముందు అక్కా, బావా ఉన్న ఇంటివేపు చూస్తే అక్కడ మట్టే ఉంది. ఇల్లు లేదు. ఇల్లూ మట్టయిపోయింది. సంతానం లేని ఇద్దరూ మట్టయిపోయారు. తన సంతానం తన కొడుకు నాగరాజు ఆమె వెంటే కావిడి మోసుకుని వస్తున్నాడు. "నివ్వు నా బిడ్డను చంపమన్నా ఆ పాముల వెంకన్న చంపలేదు. పెంచాడు. సొంత బిడ్డలా వెంట తిప్పుకున్నాడు!" మనసులో అనుకుని వరండామీద వాలుకుర్చీమీద కూర్చున్న లక్ష్మీనారాయణవైపు పడగెత్తిన పాములా చూసింది. ఏ పాములవాడి వెంట ఆ రాత్రి బలవంతాన ఆమెను పంపించేశాడో ఆ పాముల వెంకన్న చచ్చిపోయాడని లక్ష్మీనారాయణకు తెలియదు. పాముల వెంకన్న తన విద్యను తల్లీబిడ్డలు ఇద్దరికీ నేర్పాడు. తల్లికి మించి కొడుకు పాములమధ్య పెరుగుతున్నాడు. పాముల భాష నేర్చుకున్నాడు. పాములను ఆ నాగస్వరం ఊది తన అవయవాల కదలికతో ఆజ్ఞాపిస్తూ కావలసిన సేవలు చెయ్యించుకుంటున్నాడు. పాములను పట్టుకుంటున్నాడు. అవసరమైతే మళ్లీ వాటిని పుట్టల్లోనికి పంపించగలుగుతున్నాడు.

పోల్చుకోలేనంతగా కాంత మారిపోయింది. అందుకే అరుగుమీద కూర్చున్న లక్ష్మీనారాయణ కూడా ఆ నాగస్వరం వాయిస్తున్నది కాంత అని తట్టనేలేదు. వెంటనున్న కొడుకు పాములబుట్టలున్న కావిడిని [illegible]ంచి వాడూ తల్లితోపాటు నాగస్వరం అప్పుడప్పుడూ పలికిస్తున్నాడు. ఆ పెంకుటింటిలో నున్న జనాభా అంతా గుమ్మంలో చేరి ఒకే ఒక నాగుపాము ఆటకు తన్మయులై చూస్తున్నారు.

అప్పటికే ఊర్లో చాలామంది చుట్టూ చేరి ఈ వైరాగినాగు పెద్ద పడగను చూసి భయభ్రాంతుల్లో ఉన్నారు. కాబట్టి కాస్త దూరంగానే ఉన్నారు. అప్పుడు కాంత గొంతుక వినిపించింది. ఆ ముఖం ఆ నాగుపడగలా విడివడింది.

"నాగరాజా! పలుకురా పలుకు...!" అంటూ నాగును ముట్టుకోగానే అంత ఎత్తుకు లేచింది.

"ఈ ఇంటిలోనూ నాగుపాములున్నాయని కోపం వచ్చిందిరా! ఈ ఇంట్లో ఆడదాన్ని చెరిసి గర్భిణీ చేసినవాడి వైపు చూస్తున్నావురా! ఆడు వద్దంటే బలవంతం చేసి లొంగదీసినాడురా! ఆడు చేసిన తప్పుని పాలేరుమీద వేసినాడురా! పాపం, ఆ చక్కని చుక్క ఇది తగునా అంటే ఆ ఇంటి ఇల్లాలు కోసి కాకులకీ గెద్దలకీ యేస్తానందిరా!"

అని ఒక్కసారి ఆ పాము పడగ యెత్తినట్లు లేచి పెద్ద గొంతుకతో

"లక్ష్మీనారాయణా! తంత్రాల మారిగా! నన్ను సంద్రాన దించేసి, నా బతుకు కాల్చినావురా! నా బావకి లంచం ఇచ్చి నన్ను పాములవాడి వెంట పంపించావురా! పామంటే భయంతో పరుగెత్తినదాన్ని నన్ను పాముల నరకంలో తోసినావురా! ఆ నరకంలోనే పాములను మచ్చిక చేసుకుని బతుకుతున్నారురా... ఇదిగోరా... ఈ సక్కటి బొట్టిడు నీ రెండో కొడుకు రక్తంతో పుట్టినాడు. ఈడు పాములవాడిగా ఊరూరా తిరిగి అడుక్కుని బతుకుతున్నాడురా!" అని కొడుకు దగ్గరగా వెళ్లి వాడిని పట్టుకుని

"నన్నూ, నా కొడుక్కి ఇంత అన్యాయం చేసినావు. నీ ఇంట్లోనూ, నీ ఇంటిచుట్టూ ఉన్న ప్రతీ కన్నంలో పాములు సేరాల. మీ అందరి యెంట పడాల! భయంతో సావాల! థూ!" అని ఉమ్మేసింది.

ఆమెతోపాటు కొడుకూ చేరి కావిడిలో ఉన్న బుట్టల్లోని విషనాగులన్నీ లక్ష్మీనారాయణ ఇంటిమీదకి ఒక్క నిముషంలో వదలగానే పెద్ద కోలాహలం పుట్టింది. కొన్ని పాములు ఇంట్లోనికి చొరబడ్డాయి. మరికొన్ని ఇంటిముందు, ఇంటి పెరట్లో ఎవరికీ కనపడకుండా కన్నాల్లో దూరిపోయాయి. ఇంట్లో వాళ్లంతా చెల్లాచెదురైపోయారు.

"ఇంకా చూస్తారేం! దాన్ని చంపండి!" అని గెంతుతూ అరిచాడు లక్ష్మీనారాయణ.

"దగ్గరకొచ్చారో... ఈ వైరాగి నాగు మీ మీదికి ఉరుకుతాది, జాగ్రత్త!" అని బుట్ట విప్పి నాగును చేతితో పట్టుకుని కొడుకును దగ్గరగా చేర్చుకుని నిలుచుంది. ఎవరూ దగ్గరగా రాడానికి సాహసించలేదు. కాంత నోటినించి నిజం తెలుసుకున్న వాళ్లు అతని అరుపులను వినిపించుకోలేదు. అలా ఆ ఖాళీ బుట్టలతో వచ్చిన దారినే వెళ్లిపోయింది కాంత. ■

